

ప్రజలకు మెరుగైన సేవలందించాలి : డిఎల్‌డిఒ

వాల్మీకిపురం: సచివాలయాలకు వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మదనపల్లి డివిజన్ అభివృద్ధి అధికారి లక్ష్మీపతి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ షబ్బీర్ అహ్మద్‌తో కలిసి సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందనలో ప్రజల నుంచి ఏ విధంగా అర్జీలు స్వీకరించాలి, వాటిని ఏవిధంగా పరిష్కరించాలి అనే అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. సచివాలయ వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేయాలని, ప్రభుత్వం అమలు చేసే పథకాలు, సచివాలయాల్లో లభించే సేవలను ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అర్హులైన ఏ ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడంలేదని సచివాలయాలకు రాకూడదని, వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు రానివారిని గుర్తించి, వారికి పథకాలు ఎందుకు రావడం లేదు అనే దానిపై విచారించి, పథకాలు వర్తింపజేయాలని సూచించారు. సచివాలయాల్లో సిబ్బంది ఎళ్లప్పుడు అందు బాటులో ఉండి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి శకుంతల, ఇఒ ఉదయ్ కుమార్, సెక్రటరీలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పరిహారం త్వరగా చెల్లించండి : కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో మదనపల్లి నుంచి పీలేరు వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి ఎన్‌హెచ్-71కు సంబంధించిన నష్టపరిహారం చెల్లింపులను వేగవంతం చేయాలని కలెక్టర్ గిరీష పిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఇప్పటికే సేకరించిన భూములకు సంబంధించి లబ్ధిదారులకు నష్టపరిహారం చెల్లింపు అంశంపై ఆర్డీవోలు, తహశీల్దార్లు, ఎన్.హెచ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్‌హెచ్- 71 కింద మదనపల్లి నుంచి పీలేరు వరకు వాయల్పాడు, కలికిరి, మదనపల్లి, పీలేరు నాలుగు మండలాల్లోని 17 గ్రామాలలో 456.88 ఎకరాలు సేకరించారని చెప్పారు. ఇందులో భాగంగా 1921 మంది పట్టాదారులకు నష్ట పరిహారం చెల్లించాల్సి ఉండగా 244.72 ఎకరాలకు సంబంధించి 1022 మంది పట్టాదారులకు ఇవ్వడం జరిగిందని చెప్పారు. ఇంకనూ 212.16 ఎకరాలకు సంబంధించి 919 మందికి చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియలన్నీ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే సేకరించిన భూములకు సంబంధించి లబ్ధిదారులకు త్వరితగతిన నష్టపరిహారం చెల్లించేందుకు ఆర్‌డిఒలు, తహశీల్దార్లు కృషి చేయాలని సూచించారు. పెండింగ్ ఫైల్స్ గురించి ఆయా అంశాల వారీగా ఆర్‌డిఒలు, తహశీల్దార్లతో చర్చించి పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలపై తగు సూచనలు చేశారు. 379 ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయని వచ్చే మంగళవారంలోగా దాదాపు 50 శాతం తప్పనిసరిగా పరిష్కరించాలని తహశీల్దార్లను సూచించారు. ఇందులో భాగంగా భూసేకరణ చేసిన లబ్ధిదారులలో కొంతమంది ఇతర ప్రాంతాల్లో ఉన్నారని తహశీల్దార్లు వివరించారు. వీఆర్వోలు గ్రామాలలో విచారించి సంబంధిత లబ్ధిదారుల చిరునామాలు కనుగొని సమాచారం అందజేసి నష్ట పరిహారం త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టరు తెలిపారు. ఫైల్స్ పరిష్కారాన్ని ఎప్పటికప్పుడూ తగు పర్యవేక్షణ చేయాలని ఆర్‌డిఒలకు సూచించారు. అనంతరం వివిధ అంశాలలో సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ తమిమ్ అన్సారీయా, రాయచోటి, మదనపల్లి ఆర్‌డిఒలు రంగస్వామి, మురళీ, తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు పాల్గొన్నారు.

ఇండోనేషియా సమ్మిట్‌కు 'మిట్స్' ప్రొఫెసర్లు


ఇండోనేషియా ప్రొఫెసర్లతో మిట్స్ ప్రిన్సిపల్ యువరాజ్

ప్రజాశక్తి-కురబలకోట

అంగళ్ళులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, ఎంబిఎ ప్రొఫెసర్ డాక్టర్ ప్రదీప్ కుమార్ ఇండోనేషియాలో జరుగుతున్న క్యుఎస్ హయ్యర్ ఎడ్యుకేషన్ సమ్మిట్ ఆసియా పసిఫిక్ 2022లో పాల్గొన్నారు. ఇండోనేషియాలోని ఇంటర్ కాంటినెంటల్ జకార్తా పొండోక్ ఇండాహ్‌లో 8 నుంచి 10వ తేదీ వరకు ఈ హయ్యర్ ఎడ్యుకేషన్ సమ్మిట్ నిర్వహిస్తారని ప్రిన్సిపల్ యువరాజ్ పేర్కొన్నారు. ఉన్నత విద్యలో కొత్త అవకాశాలు, ప్రస్తుత సవాళ్లను పరిష్కరించడం అనే అంశంపై అంతర్జాతీయ స్థాయిలో ఎంతో మంది నిపుణులు ఈ సమ్మిట్‌లో పాల్గొని ఉన్నత విద్యలో భవిష్యత్ ప్రణాళికలు వివరిస్తారని పేర్కొన్నారు. ప్రపంచంలోని వివిధ దేశాలలో ఉన్నత విద్యలో గల మెలికలు, అభివృద్ధి మొదలైన అంశాలపై ఇందులో చర్చిస్తారని, తద్వారా విద్యార్థులకు వారి భవిష్యత్‌లో ఉపయోగపడే టెక్నాలజీలపై కూడా చర్చిస్తారన్నారు. ప్రపంచంలో ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉన్న ఉద్యోగ అవకాశాలు, ఇంటర్న్‌షిప్, ఉన్నత చదువుల గురుంచి కూడా ఇందులో వివరిస్తారని పేర్కొన్నారు.

క్షేత్రస్థాయిలో జెసి పర్యటన

ప్రజాశక్తి - రాయచోటి

భూ సమస్యలకు సంబంధించి జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. రాయచోటి మండలం, మాసాపేట గ్రామంలో స్పందనలో వచ్చిన భూ అర్జీ సమస్యకు సంబంధించి సర్వే నెంబర్ 441లో స్థలం వివరాలను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సర్వే నంబర్‌లో ఎన్ని ఎకరాలు, విస్తీర్ణం ఎంత తదితరాలను రెవెన్యూ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడి స్థల మ్యాప్ ఆమె పరిశీలించారు. ఆమె వెంట రాయచోటి ఆర్‌డిఒ రంగస్వామి, తహశీల్దార్ రవిశంకర్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న జెసి తమీమ్ అన్సారీయా

మెరుగైన వైద్య సేవలందించాలి : డిసిహెచ్‌ఎస్


ఆస్పత్రిని పరిశీలిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

ప్రజలకు సకాలంలో మెరుగైన వైద్య సేవలను అందించాలని డిసిహెచ్‌ఎస్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం స్థానిక సిహెచ్‌సి ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఆపరేషన్ థియేటర్, మందులు నిల్వ వెటర్నరీ వార్డులు తనిఖీ చేశారు. మెటర్నరీ వార్డులో వైద్య సేవలపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వైద్యులు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. త్వరలో ఆసుపత్రి స్థాయిని బట్టి డాక్టర్లను పూర్తిస్థాయిలో చర్యలు చేపడతామన్నారు. డాక్టర్లకు కౌన్సిలింగ్ జరుగుతుందని ఖాళీగా ఉన్న అన్ని పోస్టులు పూర్తి చేస్తామని తెలిపారు. నాడు నేడు కార్యక్రమంలో ఆసుపత్రి అదనపు భవనాలు నిర్మాణం, ప్రస్తుతం రూ.3.05 కోట్లతో పనులు జరిగాయని తెలిపారు. బిల్లులు కూడా చెల్లించడం జరుగుతుందన్నారు. మరో రూ.కోటి పనులు చేయాల్సి ఉందని త్వరలో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట మెడికల్ ఆఫీసర్ పాపణి, వైద్యులు వెంకటరామయ్య, ఆశాలత, షాలుఫాతిమా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ తొలగింపు

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక గేటు నుంచి బస్టాండ్ వరకు నాలుగు లేన్ల సిసి రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుపై అడ్డంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ట్రాన్స్‌కో అధికారులు మంగళవారం తొలగించి పోలీస్ పెట్రోల్ బంక్ వెనుకవైపు ఉన్న స్థలంలో అమర్చారు. భవిష్యత్‌లో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ట్రాన్స్‌ఫార్మను మార్చామని అధికారులు పేర్కొన్నారు.


ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగిస్తున్న సిబ్బంది

మంచం పట్టిన పల్లెలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

- ప్రభుత్వాస్పత్రిలో జ్వర పీడితులే అధికం
- పది రోజులుగా విజృంభిస్తోన్న జ్వరాలు
- పారిశుధ్య లోపం, కలుషిత నీరు, వాతావరణంలో మార్పే కారణమంటున్న వైద్యులు
- రోజుకు 700 నుంచి 800 మంది ఆస్పత్రులపాలు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాయచోటి పట్టణం, చుట్టూ ప్రక్క ప్రాంత ప్రజలను పది రోజులుగా జ్వరాలు పట్టిపీడిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాల వల్ల ఆయా గ్రామాల్లోని పరిసరాల్లో పారిశుధ్యం లోపించడం, వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతోనే ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని వైద్యులు పేర్కొంటున్నారు. మాండవ్య నది,యండి పల్లి,కంచలమ్మ గండి వాగుల్లో ఒండ్రుమట్టి, వాతావరణంలో మార్పే జ్వరాలకు కారణమని చెబుతున్నారు. దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులు, తీవ్ర జ్వరాలతో బాధపడుతూ ప్రజలు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు.

రోగులతో ఆస్పత్రులు కిటకిట

మాండవ్య నది పరివాహకంలోని పాత రాయచోటి, బీరాంసాహెబ్‌వీధి, లక్ష్మీ హాల్, మహబూబ్‌నగర్ పరిసర ప్రాంతాలలో, అలాగే చిన్న మండెం, రామాపురం, లక్కిరెడ్డిపల్లి, గాలివీడు, అబ్బవరం, వీరబల్లి మండలాలతో పాటు పట్టణంలోని చుట్టుపక్క గ్రామాల్లో జ్వరాలు ప్రబలి చికిత్స నిమిత్తం ప్రజలు ఆసుపత్రుల బాట పట్టారు. ఆయా మండలాలలోని వివిధ గ్రామాలకు చెందిన జ్వర పీడితులు చికిత్స నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్పత్రులకు వస్తుండటంతో రోగులతో ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. పది రోజులుగా కేవలం ప్రభుత్వ ఆసుపత్రిలోనే రోజుకు 700 నుంచి 800 మంది జ్వర పీడితులు వస్తున్నారంటే.. ఇక ప్రయివేట్ ఆస్పత్రులకు ఎంత మంది వెళ్తున్నారో అర్థం చేసుకోవచ్చు. సంబంధిత వైద్యాధికారులు గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి జ్వరాలను అదుపులోకి తీసుకరావాలని ప్రజలు కోరుతున్నారు.

'డెంగీ'పై అప్రమత్తంగా ఉండాలి

మాండవ్య నది పరివాహక, ఇతర గ్రామాల్లో ఇటీవల కాలంలో జ్వరాలు అధిక మయ్యాయి. ప్రస్తుత పరిస్థితుల్లో డెంగీ జ్వరం ప్రబలే ప్రమాదముంది. ఈ జ్వరం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పగటి పూట కుట్టే ఎడిస్ దోమ ద్వారా డెంగీ మూడు దశల్లో ప్రబలుతుంది. మొదటి దశలో డెంగీ ఫీవర్ వస్తుంది దీనివల్ల విపరీతమైన జ్వరం, తలనొప్పి, ఎముకల నొప్పులు వస్తాయి. సరైన దశలో గుర్తించి చికిత్స పొందితే జ్వరం తగ్గిపోతుంది. రెండో దశలో విపరీతమైన జ్వరంతో పాటు రక్తనాళాలు చిట్లి నోరు, ముక్కు గుండా రక్తస్రావం అవుతుంది. తెల్లరక్త కణాల సంఖ్య తగ్గిపోతుంది. ఎన్‌ఎస్-1, ఎలీషా పరీక్ష ద్వారా ఈ గుర్తించవచ్చు. మూడో దశలో డెంగీ సాక్షాసింద్రోమ్ ప్రమాదకరమైంది. ఈ దశలో శరీరం చల్లబడి, బీపీ, పల్స్ రేటు పడి పోతోంది. ఊపిరితిత్తుల్లో నెమ్ముచేరి ముఖం వాయడం, తదితర లక్షణాలు కనిపిస్తాయి. ఎడిస్ దోమ వ్యాప్తి చెందకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. కూలర్లు, పూల కుండీలను ఎప్పటికప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలి.



- డాక్టర్ మహేశ్వరరాజు, ప్రభుత్వాస్పత్రి వైద్యులు.

'భోజనం'లో నాణ్యత లోపిస్తే చర్యలు : జడ్జి

ప్రజాశక్తి-నందలూరు

పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత లోపిస్తే రాజీ పడేది లేదని నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కె.లత డిఇఒ, స్థానిక అధికారులను హెచ్చరించారు. మంగళవారం కోర్టులో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై జరిగిన విచారణకు డిఇఒ రాఘవరెడ్డి, తహశీల్దార్ ఉదయ శంకర్‌రాజు, ఎంఇఒ జయవేలు, నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు గంగిరెడ్డి, మధ్యాహ్న భోజన వంట నిర్వాహకులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో జరిగిన విచారణలో జడ్జి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత లోపించిందని ప్రధానోపాధ్యాయులు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు అందవలసిన పదార్థాలు అందడం లేదని, వంట ఏజెన్సీ వారు విద్యార్థులను అసభ్య పదజాలంతో తిడుతున్నారని విద్యార్థులు తనకు కోర్టులో ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. పాఠశాలలో చదివే విద్యార్థులను ఉపాధ్యాయుల పిల్లలతో సమానమని వారికి నాణ్యమైన భోజనం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. తాను విద్యార్థులకు అవగాహన సదస్సులో పలు పాఠశాలలకు హాజరయ్యానని ఆయా పాఠశాలల్లోని విద్యార్థులు తనతో సమస్యలు షేర్ చేసుకోవడం జరిగిందన్నారు. మండలంలోని నాలుగు పాఠశాలల నుంచి వివిధ సమస్యలపై తనకు ఫిర్యాదులు అందాయని అన్నారు. ఇకపై ఇలాంటి ఫిర్యాదులు వస్తే పోలీసులకు కేసు నమోదు చేయాలని సిఫారసు చేస్తానన్నారు. నందలూరు, పెనగలూరు, పుల్లంపేట మండలాల్లోని తహశీల్దార్, ఎంపిడిఒ, ఎంఇఒలు ఒక కమిటీగా ఏర్పడి ఆయా మండలాల్లోని అన్ని పాఠశాలలను విజిట్ చేసి కోర్టుకు ఈ నెల 23వ తేదీకి నివేదిక సమర్పించాలన్నారు. నివేదిక పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు చేపట్టామని తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం న్యాయపరంగా తన వంతు సహకారం అందించడంతోపాటు ఎవరైనా తప్పులు చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో జరిగిన అవకతవకలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలియజేశారు.


కోర్టుకు హాజరైన డిఇఒ రాఘవరెడ్డి, అధికారులు

మల్బరీ సాగుతో అధిక లాభాలు

- సెరికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ రవీంద్రనాథ్

ప్రజాశక్తి-రామాపురం

రైతులు మల్బరీ సాగు చేయడం వల్ల అధిక లాభాలు పొందవచ్చని సెరికల్చర్ ఏడీ రవీంద్రనాథ్ అన్నారు మండలంలోని చిట్లూరులో రాజా అనే రైతు పొలం వద్ద ఏర్పాటు చేసిన పట్టుబడి కార్యక్రమంలో భాగంగా మంగళవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రైతులు వివిధ రకాల పంటలు సాగు చేసి నష్టాలతో ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలను మనం చూస్తున్నామని చెప్పారు. మల్బరీ సాగు చేసి నష్టపోయిన రైతులు ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు ఎక్కడా లేరన్నారు. ఇతర పంటలు సాగు చేస్తే ఒక్క కాపు వరకే వస్తుందని మల్బరీ సాగు చేస్తే 20 సంవత్సరాల వరకు సాగు చేసుకోవచ్చన్నారు. మల్బరీ షెడ్లు వేసుకునేందుకు ఎస్సీ ఎస్టీ రైతులకు షెడ్డు నిర్మాణానికి రూ. 3.6 లక్షలు, ఇతరులకు రూ.3 లక్షలు ఇస్తారన్నారు. మల్బరీ మొక్క నాటడానికి ఎస్సీ, ఎస్‌టి అభ్యర్థులకు రూ. 22,500 ఇతరులకు రూ. 18750, మల్బరీ పరికరాల కొనుగోలుకు రూ. 76 వేల సబ్సిడీ ఇస్తారని చెప్పారు. చిన్న షెడ్లకు ఇతరులకు రూ. 2 లక్షల 25 వేలు, ఎస్సీ ఎస్టీలకు రూ. 2 లక్షల 75 వేలు ఇస్తారని పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో కొందరు యువకులు సాఫ్ట్ వేర్ రంగాన్ని వదిలేసి మల్బరీ సాగుపై ఆసక్తి చూపుతూ లక్షలు ఆర్జిస్తున్నారని ఆయన పేర్కొన్నారు ఎఎస్‌ఒ నాగ సుబ్బరాయుడు మాట్లాడుతూ షెడ్డు నిర్మాణానికి కావాల్సిన కొలతలు, చెట్ల మధ్యన దూరం,ఎలా సాగు చేసుకోవాలి వంటి వాటిపై రైతులకు వివరించారు. అనంతరం క్షేత్రస్థాయిలో రాజా సాగు చేసిన మలబరీ పంటను పరిశీలించి రైతులకు మలబరీ సాగు మెలకువలను వివరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ చాంద్‌బాషా, టి.ఒ విశ్వనాథరెడ్డి నాయక్, విఎస్‌ఎ వెంకటరమణ, రైతులు పాల్గన్నారు.


క్షేత్రస్థాయిలో మల్బరీ సాగుపై సూచనలు చేస్తున్న ఎడి రవీంద్రనాథ్

ప్రారంభానికి నోచని బౌద్ధరామాల అతిథి గృహం


ముక్తికనుమ వద్ద నిర్మించిన బౌద్ధరామాల పర్యాటక అతిథి గృహం

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని ఆడపూరు ముక్తికనుమ వద్ద రూ.1.30 కోట్లతో నిర్మించిన బౌద్ధారామాల పర్యాటక అతిథి గృహం పూర్తయి నాలుగేళ్లు అవుతున్నా ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. గత ప్రభుత్వంలో రాష్ట్ర పర్యాటక శాఖ బౌద్ధరామాల వద్ద అతిథి గృహంలో ధ్యాన మందిరం, సమావేశ మందిరం తోపాటు పార్కు, టాయిలెట్స్ నిర్మాణాలు జరిగాయి. అతిథి గృహంలో ప్రత్యేకంగా బుద్ధ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. క్రీ.శ. ఒకటవ శతాబ్దానికి చెందిన బౌద్ధారామ స్తూపాలు ముక్తి కనుమలలో ఉన్నాయి. 1977లో అప్పట్లో రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో తవ్వకాలు సాగాయి. 1979లో ముక్తి కనుమపై 21 స్థూపాలు బయల్పడ్డాయి. అప్పట్లో ప్రభుత్వాలు సరైన ప్రచారాలు నిర్వహించకపోవడంతో బౌద్ధరామాల స్థూపాలకు తగినంత ఆదరణ లభించలేదు. గత ప్రభుత్వాలు బౌద్ధ ఆరామాలపై ప్రత్యేక దృష్టి సారించి నిధులు మంజూరు చేసినా నిర్మాణాలలో అలసత్వం, ప్రజలకు వీటిపై అవగాహన కల్పించక పోవడంతో పర్యాటకులకు ఈ బౌద్ధరామాలు తెలియక ఇక్కడ అభివృద్ధి జరగలేదు. ఇప్పటికైనా పర్యాటక శాఖవారు అతిథి గృహం ప్రారంభించి మరిన్ని నిధులతో పర్యాటకులకు బౌద్ధారామాలు ప్రచారానికి వినియోగిస్తే సమీపంలోని సౌమ్యనాథ ఆలయం ఉండడంతో తప్పనిసరిగా భక్తులు, పర్యాటకులు బౌద్ధరామాల సందర్శనకు వస్తారని ఈ ప్రాంతం అభివృద్ధి చెందేందుకు వీలవుతుందని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమలో అరుదుగా ఉన్న ఈ బౌద్ధ ఆరామాలను మరింత అభివృద్ధి చేయాల్సిన బాధ్యత పర్యాటకశాఖపై ఉంది.


మాట్లాడుతున్న గాజుల ఖాదర్‌బాషా

బియ్యాన్నీ వదలని ప్రభుత్వం : టిడిపి

ప్రజాశక్తి - రాయచోటి

పేదవాడికి అందుతున్న బియ్యాన్ని కూడా వదలని దౌర్భాగ్యపు ప్రభుత్వమని, ధాన్యం కొనుగోలులో నూతన నిబంధనలతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారని రాష్ట్ర టిడిపి కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా పేర్కొన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతేడాది రైతులు విక్రయించిన ధాన్యం బకాయిలు అందక ఇప్పటికీ అగచాట్లు పడుతున్నారు అన్నారు. నూతన నిబంధనలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే అన్నదాతలు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతారని వాపోయారు. పంటలకు మద్దతు లేదు, పంట నష్టపోయిన వారికి పరిహారం అందలేదని తెలిపారు. అన్నదాతల ఆత్మహత్యల్లో దేశంలోనే మూడో స్థానం, కౌలు రైతుల ఆత్మహత్యల్లో రెండో స్థానంలో ఏపీ ఉందని వాపోయారు. ఎక్కువ అప్పులున్న రాష్ట్రాల్లో ఏపీ ప్రథమ స్థానంలో ఉందని చెప్పారు. ఈ ఏడాది రైతుల నుంచి పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తామనే ముఖ్యమంత్రి మాటలు, కాగితాలకే పరిమి తమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా అమలు చేయనున్న నిబంధనలతో అన్నదాతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ప్రభుత్వం పునరాలోచించాలని డిమాండ్ చేశారు. లేనియెడల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి హరి, అమర్‌నాథ్‌రెడ్డి, గాలివీడు క్లస్టర్ ఇన్‌చార్జ్ సత్య రెడ్డి, టిడిపి నాయకులు దుద్యాల హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

వివాహానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఫ్రెండ్స్ సొసైటీ కువైట్ టీమ్ అధ్వర్యంలో అన్నమయ్య జిల్లాలోని కలకడ మండలానికి చెందిన పేదింటి ఆడపిల్ల వివాహం కోసం రూ.5 వేలు నగదు రూపంలో ఆర్థిక సాయాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఫ్రెండ్స్ సొసైటీ కువైట్ టీం అధ్యక్షుడు ముక్తియార్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా ఫ్రెండ్ సొసైటీ సభ్యుల సహకారంతో పేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం, పేద ఆడపడుచుల పెళ్లి కోసం ఆర్థిక సాయం అందజేస్తున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరూ సమాజ సేవ చేయటానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు అసిఫ్, షా నవాజ్, మసూద్ అలీ, జమాల్ పాల్గొన్నారు.


అధికారులు, కాంట్రాక్టర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

టిడ్కో ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

ప్రభుత్వం చేపట్టిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందజేసేలా నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ గిరీష్ అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ విసి హాల్‌లో టిడ్కో ఇళ్ల నిర్మాణం పురోగతి, వసతుల కల్పన అభివృద్ధి పనులపై మున్సిపల్ కమిషనర్లతో పాటు కాంట్రాక్ట ర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల కాలనీల్లో మౌలిక వసతులు యుద్ధ ప్రాతిపదికన కల్పించాలని ఆదేశించారు. రోడ్డు పనులను కూడా వేగవంతం చేయాలని సూచించారు. మదనపల్లి టిడ్కోలో ఎంతమంది లబ్ధిదారులు, ఎన్ని పూర్తి అయ్యాయి, ఇంకా ఎన్ని పూర్తి చేయాలి వంటి వివరాలను మున్సిపల్ కమిషనర్‌ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వచ్చే సోమవారంలోగా పనులన్నీ ప్రారంభించాలని చెప్పారు. పనులను పర్యవేక్షణ చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు. రాయచోటి టిడ్కో ఇళ్ల పరిస్థితిపై ఆరా తీశారు. 77 మంది టిడ్కో ఇళ్లకు సంబంధించి రుణాలు కట్టారని మున్సిపల్ కమిషనర్ కలెక్టర్ వివరించారు. బిల్డింగ్ నిర్మాణ పనులన్నీ రెండు నెలల్లో పూర్తి చేయాలని సూచించారు. సమీక్షలో రాయచోటి మున్సిపల్ కమిషనర్ రాంబాబు, మదనపల్లి మున్సిపల్ కమిషనర్ ప్రమీల, టిడ్కో డిఇలు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

తాగునీటి బోరుకు మరమ్మతులు

ప్రజాశక్తి - వీరబల్లి

మండలంలోని మట్లి పంచాయతీ ఆసాది వాండ్లపల్లెలో దెబ్బతిన్న తాగునీటి బోరుకు మంగళవారం సర్పంచ్ నాగార్జున చారి మరమ్మతులు చేయించారు. ఇటీవల బోరు చెడిపోవడంతో తాగునీటి సమస్య తలెత్తింది. ఈ విషయాన్ని సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి అక్కడున్న స్థానికులను పిలిపించి తమ సొంత నిధులతో బోరుకు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు ఎటువంటి సమస్యలైనా తీర్చేందుకు తాను ముందుంటానన్నారు. గ్రామస్తులందరూ కలిసి ఆయనను అభినందించారు.


బోరుకు మరమ్మతులు చేయిస్తున్న సర్పంచ్



ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం : 'చింతల'

ప్రజాశక్తి - కలకడ

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కోటగుడిబండ పంచాయతీలోని తెట్టు, పాపుగారిపల్లి, గుడిబండ, తదితర గ్రామాలలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామాలలో ఇంటింటా వికలాంగ, వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళ, తదితర పింఛన్లు రానివారు అర్హులుగా ఉంటే వారికి పింఛన్లు మంజూరు చేసేందుకు సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ పంచాయతీలోని ప్రజల సమస్యలపై దృష్టి సారించి వారికి అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించేందుకు ప్రతి అధికారి సహకరించాలన్నారు. ప్రతి అధికారి సమయపాలన పాటించి విధులకు హాజరై ప్రజా సమస్యలపై దృష్టి సారించాలన్నారు. అనంతరం ప్రభుత్వం నుండి ప్రతి ఒక్కరూ లబ్ధి పొందుతున్న అంశాలపై ఆరాతీసి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గుడిబండలో 104 వాహనాల వైద్య సేవలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిపి శ్రీదేవి రవికుమార్, కలికిరి మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ బరకం రవికుమార్‌రెడ్డి, మండల ఆర్‌బికె చైర్మన్ హరినాథ్‌రెడ్డి, ఎంపిడిఒ సిహెచ్ నారాయణ, తహశీల్దార్ రాము, ఎంఇఒ మునీంద్ర నాయక్, డిప్యూటీ తహశీల్దార్ సయ్యద్, ఆర్‌ఐ మస్తాన్ వలి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ ఈశ్వరన్న, ఎపిఒ చెన్నకేశవులు, విఆర్‌ఒలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



లోక్ అదాలత్‌పై ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

లోక్ అదాలత్‌పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-సుండుపల్లి

ఈ నెల 12వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి లత అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మంగళవారం కోర్టు ఆవరణము నుండి ఎర్ర చెరువు కట్ట వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరం పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ వీలవుతుందన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎజిపి షేక్ షమీవుల్లా ఖాన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి నర్సింహులు, మాజీ ఎజిపి షేక్ మహమ్మద్ అలీ, న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.



ఆర్‌డిఒకు విన్నవించుకుంటున్న బాధితులు

ఆర్‌డిఒకు రామ్‌నగర్ బాధితుల వినతి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రామ్‌నగర్‌లో అక్రమంగా ఉన్న నిర్మాణాలు చేపడుతున్న వారిని తహశీల్దారు సుబ్రహ్మణ్యంరెడ్డి, పట్టణ ఎస్ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి వారించి అక్రమ నిర్మాణాలు చేపట్టకుండా తాత్కాలికంగా అడ్డుకున్న విషయం విధితమే. మున్సిపాలిటీ పరిధిలోని రాంనగర్‌లోని సర్వే నెంబర్ 968లో 9 సెంట్ల స్థలాన్ని అమ్మినవారే తిరిగి ఆ స్థలంలో దౌర్జన్యంగా అక్రమ కట్టడాలకు పూనుకున్నారని మంగళవారం ఆర్‌డిఒ కోదండరామిరెడ్డిని కలిసి బాధితులు తమ ఆవేదన తెలియజేశారు. తక్షణమే స్పందించిన ఆర్‌డిఒ తహశీల్దార్‌ను చరవాణి ద్వారా సర్వే నెంబర్ 968లో ఇరువురు ఎటువంటి కట్టడాలు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

27న కడపలో భగవద్గీత శ్లోకాల పోటీలు

రాజంపేట అర్బన్: టిటిడి, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 27న ఉదయం 9 గంటల నుంచి 6, 7, 8, 9 తరగతులు చదివే విద్యార్థులకు కడప నగరం శంకరాపురంలోని టిటిడి కళ్యాణ మండపంలో భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు జరుగనున్నాయని సంస్థ ప్రతినిధులు కాకర్ల రాముడు, ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణలు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగలవారు పోటీలో నేరుగా పాల్గొనవచ్చని కోరారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాలల యాజమాన్యాలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. 6, 7 తరగతుల విద్యార్థులు జూనియర్ విభాగంగా 8, 9 తరగతుల విద్యార్థులు సీనియర్ విభాగంగా భగవద్గీతలోని నాలుగవ అధ్యాయం, జ్ఞాన యోగంలోని 42 శ్లోకాలు చెప్పాల్సివుంటుందన్నారు. సంపూర్ణ భగవద్గీత 18 అధ్యాయాలపైన పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 18 ఏళ్లలోపు వారు ఒక విభాగంగా, 18 ఏళ్లు పైబడిన వారు మరో విభాగంగా అన్ని అధ్యాయాలపై పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి విభాగాల వారీగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశామని తెలిపారు. మొదటి బహుమతులు పొందిన వారిని తిరుపతిలో నిర్వహించే భగవద్గీత పోటీలకు పంపుతామన్నారు. పూర్తి వివరాలకు టి.గోపిబాబు, ప్రోగ్రాం అసిస్టెంట్, హిందూ ధర్మ ప్రచార పరిషత్, తిరుమల తిరుపతి దేవస్థానములు వారు పేర్కొన్నారు.

ఎగ్జిబిషన్‌ను సందర్శించిన 'వెలుగు' విద్యార్థులు

మదనపల్లె అర్బన్: మండలంలోని అమ్మచెరువుమిట్ట వెలుగు ప్రత్యేక పాఠశాలలోని విభిన్నప్రతిభావంతులు, వృద్ధాశ్రమంలోని వృద్ధులు బిటి కాలేజీ గ్రౌండులో ఏర్పాటు చేసిన డిస్నీ ల్యాండ్ ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన రోబోటిక్ జంతువులు చేసే శబ్దాలు విని పిల్లలు ఎంతో ఆశ్చర్యానందంతో గంతులు వేశారు. ట్రైన్‌లో తిరిగారు, కొలంబస్, డ్రాగన్ రైడ్, బైక్ రైడింగ్, రోలర్ కోస్టర్, హెలికాప్టర్ రైడ్ వంటి వాటిని తిలకించారు. ఎగ్జిబిషన్‌లోకి అనుమతించిన మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే, ఎగ్జిబిషన్ యాజమాన్యంకి వెలుగు సెక్రటరీ ఎం.ఉదయ్ మోహన్‌రెడ్డి, కన్వీనర్ ఆర్.భాగ్యలక్ష్మి, పిల్లలు, వృద్ధులు, సిబ్బంది ధన్యవాదములు తెలియజేశారు.



ఎగ్జిబిషన్‌ను సందర్శిస్తున్న వెలుగు చిన్నారులు, వృద్ధులు

నిరుపయోగంగా పాల కేంద్రం

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- పట్టని అధికారులు.. ఇబ్బందుల్లో ప్రజలు



మూతపడిన పాల కేంద్రం



మందుబాబులు వదిలి వెళ్లిన మద్యం బాటిళ్లు

ప్రజాశక్తి-రామాపురం

మండల కేంద్రానికి కూత వేటు దూరంలో మూతపడ్డ పాల కేంద్రం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డంగా మారింది. ఆకతాయిలు మందుబాబులకు అడ్డాగా మారింది. మండల కేంద్రంలో పని చూసుకొని స్వగ్రామాలకు వెళ్లే వారికి ఇబ్బందిగా మారింది. సరస్వతిపల్లి, బాల్‌రెడ్డిగారిపల్లె, బీదవారిపల్లె, ఉడుంవారిపల్లి, నాయునివారిపల్లె, గ్రామస్తులు ఈ రహదారి నుంచి వెళ్లారు. పాఠశాలలు, కళాశాలలకు విద్యార్థులు ఈ రహదారి గుండా వెళ్లాల్సి ఉంది. సాయంత్రం ఆరు గంటలు దాటిందంటే మహిళలు పిల్లలు భయం భయంగా వెళ్లాల్సిందే. మండల కేంద్రం నుండి సరస్వతిపల్లి దారి వెంబడి మందు బాబులు ఆకతాయిలో దర్శన మిస్తూనే ఉంట. రోడ్డుకు ఇరువైపులా కాళీ ప్రాంతాలలో వందలాది తాగి పడేసిన వందలాది బాటిళ్లను చూస్తేనే అర్థమ వుతుంది. మూతబడ్డ పాల కేంద్రంలో పరిస్థితి మరి దారుణంగా ఉంటుంది ఖాళీ బాటిల్‌లతో సహా పేకాట రాయుళ్ళ వదిలేసిన పేక ముక్కలు నిరోధ్ ప్యాకెట్లు చూస్తేనే అసహ్యించుకునే విధంగా పడి ఉన్నాయి. పోలీసులు సాయంత్రం ఆరు గంటలు పైబడి ఆ రూట్ లో మఫ్టీలో వెళితే వాస్తవాలు తెలిసిపోతాయి ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకోకుండా నిరోధించాలని పలువురు మహిళలు, విద్యార్థులు పిల్లలు కోరుతున్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ఆశయం : 'కొరముట్ల'

ప్రజాశక్తి- పుల్లంపేట

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఎంపిడిఒ సభాభవనంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి ముద్దా బాబుల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడతూ ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, దానికి అనుగుణంగానే సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. వైద్యాధికారి డాక్టర్ మనోజ్ మాట్లాడుతూ వర్షాలతో మండలంలో ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నారన్నారు. 104 వాహనాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం జలజీవనం మిషన్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కార్యక్రమాల్లో ఒకటని ప్రతి ఇంటికీ మంచి నీటిని అందివ్వడమే లక్ష్యంగా పనిచేస్తుందని తెలిపారు. మండలంలోని ప్రజలకి మంచినీరు అంది ఇవ్వడంలో మండలం మూడో స్థానంలో ఉందన్నారు. వ్యవసాయ శాఖ అధికారి కృష్ణచైతన్య మాట్లాడుతూ మండలంలో 5700 ఎకరాల్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఇ-క్రాప్ నమోదు చేశామన్నారు. హౌసింగ్ ఎఇ మాట్లాడుతూ పుల్లంపేట మండలానికి 933 జగనన్న ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. ఎవరైనా సొంత స్థలం కలిగి హౌసింగ్‌కి అప్లై చేసుకోవాలంటే మంజూరు చేయడానికి అన్నివేళలా సహాయ సహకారాలు మా ద్వారా అందిస్తామని పేర్కొన్నారు. ఉపాధి హామీ ఎఒ మాట్లాడుతూ జగనన్న ఇళ్ల కార్యక్రమంలో భాగంగా 425 రోజుల పని దినాలు కల్పించామన్నారు. తహశీల్దార్ నరసింహ కుమార్ మాట్లాడుతూ మండలంలోని శ్మశానాలను ఆయా పంచాయతీలోని సర్పంచులు, ఎంపిటిసిలు గుర్తించి తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. సిడిపిఒ రాజేశ్వరి మాట్లాడుతూ మండలంలో 288 మంది గర్భిణులు, 346 మంది బాలింతలు ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, జడ్‌పిటిసి రామనాథం, ఎంపిడిఒ ప్రకాశం, ఎంఇఒ రంగనాథయ్య, సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ శ్రీనివాసులు

అభివృద్ధి పనులు వేగవంతం : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

రాయచోటి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని, మున్సిపాలిటీ, రెవెన్యూ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. హరిత హోటల్, ఎంఐజి లే అవుట్ వంటి వాటికి భూమి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో రాయచోటి మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై కలెక్టర్ మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాయచోటిలో కొనసాగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాల స్థితిగతులపై కలెక్టర్ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. వెలిగల్లు ప్రాజెక్టు కింద రూ. 98 కోట్లతో నీటి సరఫరాలో మంచి పురోగతి ఉందని అధికారులు సమాధానమిచ్చారు. ఎస్ఎన్ కాలనీ సాయిబాబా గుడి పక్కన పార్క్ పనులు కూడా పురోగతిలో ఉన్నాయని చెప్పారు. కడప రింగ్ రోడ్ సర్కిల్ అభివృద్ధికి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) నిధులను వినియోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. క్రికెట్ స్టేడియం నిర్మాణ పురోగతిని సంబంధిత అధికారులు కలెక్టర్‌కు తెలియజేశారు. ఇటీవల రాయచోటికి కేటాయించిన శిల్పారామం నిర్మాణానికి అవసరమైన అదనపు స్థలాన్ని సమకూర్చాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జిల్లా అతిథి గృహం కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులపై కలెక్టర్ ఆరా తీశారు. నిర్మాణ పనులు బాగా జరుగుతున్నాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో రాయచోటి మున్సిపల్ కమిషనర్ రాంబాబు, రాయచోటి తహశీల్దార్ రవిశంకర్ రెడ్డి పాల్గొన్నారు.

'గృహ నిర్మాణాలపై కలెక్టర్ సమీక్ష'

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ఇంజినీర్లను కలెక్టర్ గిరిష పిఎస్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అర్హులైన లబ్ధిదారులకు ఇంటి పట్టాల కోసం ఎక్కడెక్కడ భూమి అవసరం, ఇంకా ఎన్ని పట్టాలు పంపిణీ చేయాలి వంటి అంశాలపై కలెక్టర్ రాయచోటి నియోజవర్గంలో తహశీల్దార్లు, గృహ నిర్మాణశాఖ ఇంజినీర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన డిఆర్‌సిలో అర్హులైన పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ కోసం భూమి అవసరముందని ఎమ్మెల్యే అడిగారని, అందుకోసం గృహ నిర్మాణం కోసం ఎక్కడైతే స్థలం అవసరమో ఆ మండలంలో స్థల సేకరణ, లేఅవుట్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. గడపగడప మన ప్రభుత్వ కార్యక్రమంలో ఇంటి స్థలం కావాలని ఎమ్మెల్యేకు అర్జీలు ఇస్తారని, అలాంటి దరఖాస్తులను వెంటనే తీసుకోవాలని తహశీల్దార్లకు సూచించారు. గాలివీడు, గోపనపల్లి, నూలివీడు, గోరన్‌చెరువు జగనన్న కాలనీ లేఅవుట్ సంబంధించి కొన్ని సమస్యలు ఉన్నాయని వాటిని త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. చిన్నమండెం మండలంలో ఎంతమందికి స్థలం అవసరమో తహశీల్దార్‌ను కలెక్టర్ ప్రశ్నించారు. పడమటి కోన, చిన్నమండెం మండల కేంద్రంలో స్థలం కావాలని కలెక్టర్‌కు వివరించారు. ప్రభుత్వ స్థలాలు ఉంటే వెంటనే గుర్తించాలన్నారు. కార్యక్రమంలో రాయచోటి ఆర్డీవో రంగస్వామి, హౌసింగ్ పీడీ శివయ్య, రాయచోటి నియోజవర్గంలోని తహశీల్దార్లు, హౌసింగ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - బి.కొత్తకోట

2023లో జరుగనున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకొని పట్టణంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పోలింగ్ కేంద్రానికి కేటాయించారు. మంగళవారం తహశీల్దార్ ధనుంజయులు, ఎంపిడిఒ శంకరయ్య, ఎంఇఒ రెడ్డిశేఖర్ సంబంధిత అధికారులతో కలిసి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు పట్టణంలో ఒక పోలింగ్ కేంద్రం మంజూరయిందన్నారు. ఈ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చే పట్టభద్రులు, ఉపాధ్యాయులకు అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, పట్టభద్రులు, ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. **కలకడ :** మండల కేంద్రమైన కలకడలో పోలింగ్ కేంద్రాలను తమశీల్దార్ రాము పోలింగ్ పరిశీలించారు. స్థానిక బాటవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగులో ఉన్న పోలింగ్ బూత్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో సర్వేయర్ పార్వతి, ఉపాధ్యాయుడు వైవి రమణ పాల్గొన్నారు.



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

రోగులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎస్‌డిహెచ్‌ఆర్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్ చైర్మన్ డి.వి.ఎస్ చక్రవర్తిరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు లయన్ షేక్ మహమ్మద్ మాట్లాడుతూ చైర్మన్ జన్మదిన వేడుకలు పురస్కరించుకుని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఆయనకు కళాశాల సిబ్బంది, లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ సభ్యులందరి తరపున ఆయనకు పుట్టిన రోజు శుభాకాక్షలు తెలిపారు. అలాగే ఇన్‌స్టిట్యూషన్ వ్యవస్థాపకులు హరనాథ రెడ్డి మాట్లాడుతూ తన కుమారుడు చక్రవర్తి రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. దాదాపు 28 ఏళ్లుగా వేలమంది పేద విద్యార్థులకు చదువు చెప్పి వారు ఉన్నత శిఖరాలకు చేరే మార్గాన్ని చూపుతున్నారని చెప్పారు. అనంతరం సీనియర్ వైద్యులు లయన్ మహేశ్వర్ రాజు మాట్లాడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందతున్న రోగులకు పండ్లు పంపిణీ చేయడం సంతోషంగా ఉంచి తెలిపారు. చక్రవర్తి రెడ్డి రాయచోటి లోనేగాక సుండుపల్లి, పెద్దమండెం, తిరుపతి నగరాలలో ఉండే పేద విద్యార్థులకు విద్యని అందిస్తున్నారని అలాగే భవిష్యత్తులో కూడా ఇంకా మరెన్నో పేద విద్యార్థులకు విద్య అందించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు లయన్ హరీష్ చంద్ర,కళాశాల సిబ్బంది జనార్ధన్ రెడ్డి, గురుశంకర్ రెడ్డి, రామాంజులు అన్నమయ్య జిల్లా అంజుమన్ తరిఖీ కమిటీ వైస్ చైర్మన్ మహబూబ్ బాషా ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని గోపిదిన్నె గ్రామ సచివాలయం వద్ద మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి సహకారంతో సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, ఎంపిటిసి జయమ్మ ఆధ్వర్యంలో మదనపల్లి ఎల్‌వి ప్రసాద్, నేత్ర వైద్య విజ్ఞాన కేంద్రం వారు వైద్య శిబిరం నిర్వహించారు. 108 మంది హాజరయ్యారు. విజన్ టెక్నీషియన్లు సిద్దిక్, శ్రావణి కంటి పరీక్షలు చేశారు. ఆపరేషన్లు అవసరమైన 54 మందిని గుర్తించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆపరేషన్లకు ఎంపికైన వారికి మదనపల్లి ఎల్వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన కేంద్రం వద్ద 4 విడతలగా ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని ఆ కేంద్రం ప్రతినిధి సాంబశివ, భాస్కర్ తెలిపారు.

పీలేరు: ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పీలేరు కడప రోడ్డులోని భాస్కర నేత్రాలయ ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం పులిచెర్ల మండలం, ఎంపిడిఒ కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపిడిఒ సుగుణమ్మ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. భాస్కర నేత్రాలయ ఆస్పత్రి ఆప్టోమెట్రిస్ట్ షౌకత్ అలీ బాష సుమారు 100 మందికి కంటి చూపు పరీక్షలు చేశారు. కంటి చూపు సమస్యల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మాధురి, సోనీ తదితర సిబ్బంది పాల్గొని వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కార్యాలయం, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



బి.కొత్తకోట : పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు



తంబళ్లపల్లె : రోగికి కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్



నారా లోకేష్‌ను సన్మానిస్తున్న తెలుగు యువత నాయకులు నవీన్

'పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు కృషి'

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారం కోసం తెలుగు యువత గట్టిగా కష్టపడి పని చేస్తామని రాజంపేట తెలుగు యువత అధ్యక్షులు తోపిరెడ్డి నవీన్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు మంగళవారం హైదరాబాదులో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను కలిసి రాజంపేట పార్లమెంట్ పరిధిలోని తెలుగు యువత బలోపేతానికి సమావేశాలు పెట్టి పార్టీ కోసం కృషి చేస్తున్నట్లు లోకేష్ వివరించారనీ ఆయన తెలిపారు యువత కష్టపడి పని చేస్తే 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పూర్తి విజయం సాధిస్తుందని రాష్ట్రంలోని పార్లమెంటు పరిధిలో తెలుగు యువత అధ్యక్షులు వైసిపి పరిపాలన అక్రమాలపై ప్రజలకు వివరించాలన్నారు పార్లమెంటు పరిధిలోని తెలుగు యువత కమిటీలు పూర్తి చేసి పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని లోకేష్ తెలిపినట్లు ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షులు పాలడుగు రెడ్డప్ప నాయుడు సుదర్శన్‌రెడ్డి కార్యదర్శి తలారి మంజునాథ్ పుంగనూరు నియోజకవర్గ టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు కాలవ గడ్డ మునీంద్ర కార్తీక్ చిన్నమండెం ఐటిడిపి అధ్యక్షులు మట్లి మురళి నాయుడు పాల్గొన్నారు



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ గురుప్రసాద్

బాల్‌బ్యాడ్మింటన్‌లో 'జ్ఞానాంబిక' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఎస్వీ యూనివర్సిటీ ఇంటర్ కొలిజియేట్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో మదనపల్లి శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థినిలు ప్రభంజనం సృష్టించి ప్రథమ స్థానంలో నిలిచారని కళాశాల కరస్పాండంట్ రాటకొండ గురుప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూని వర్సిటీ పరిధిలో ఈ నెల 6, 7 తేదీలలో నిర్వహించిన ఈ పోటీల్లో అద్భుతంగా రాణించిన జ్ఞానాంబిక జట్టు విజేతగా నిలిచి రోలింగ్ షీల్డ్ అందుకున్నారని తెలిపారు. బాలికల బ్యాడ్మింటన్ జట్టు ఎస్వీ యూనివర్సిటీకి ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చేనెల జాతీయ స్థాయిలో జరిగే జాతీయ స్థాయిలో యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటారన్నారు. అనంతరం బాలికల జట్టులోని విద్యార్థులను మెడల్స్ వేసి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమాదేవి, పీడీ శరత్ కుమార్ నాయక్ పాల్గొన్నారు.



కీర్తనను అభినందిస్తున్న ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి

జాతీయ పోటీలకు విద్యార్థులు ఎంపిక

నందలూరు: జాతీయ స్థాయి కరాటే, రెజ్లింగ్, సైకిల్ పోలోకు సంబంధించిన క్రీడల్లో నందలూరులోని ఆడపూరు వద్దగల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ మాధవి లత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయస్థాయి కరాటే పోటీలకు కీర్తన అనే విద్యార్థిని ఇటీవల కేరళలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీలలో కీర్తన తన ప్రతిభను కనబరిచి గోల్డ్ మెడల్ సాధించిందన్నారు. ఈనెల 24న అయోధ్యలో జరిగే జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలలో గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు కె.కీర్తన, జి.హనీ సాయి ప్రియ, జి.భారతి, పాల్గొంటారన్నారు. ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి విద్యార్థులను అభినందించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు విద్యతోపాటు జాతీయ స్థాయి క్రీడల్లో రాణించేందుకు కృషి చేసిన ప్రిన్సిపల్ మాధవి లత, పీడీ నాగమణిలను అభినందించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సౌభాగ్యమ్మ, వైస్ ఎంపిపి అనుదీప్, ఎంపిటిసి సోమిశెట్టి ప్రభాకర్, వైసిపి నాయకులు అరిగె నాని, ఓట్స్ శీను, నాగసుబ్బయ్య, పాల్గొన్నారు.

నేడు చౌడసముద్రానికి ఎమ్మెల్యే రాక

ములకలచెరువు: మండలంలోని చౌడసముద్రం పంచాయతీలో నేడు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టనున్నట్లు ఎంపిపి సాయి లీల మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఉదయం 9:30 గంటలకు గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, జడ్‌పిటిసి, మార్కెట్ యార్డ్ చైర్మన్, మండల కన్వీనర్, వైస్ ఎంపిపిలు, సర్పంచులు, ఎంపిటిసిలు, అన్ని శాఖల అధికారులు, కార్యదర్శులు పాల్గొనాని పేర్కొన్నారు.

క్రైం కార్నర్

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

ప్రజాశక్తి - బి.కొత్తకోట

ద్విచక్ర వాహనాల చోరీలకి పాల్పడుతున్న నిందితుడిని మంగళవారం అరెస్టు చేశామని ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. మూడు రోజుల క్రితం మండలంలోని గట్టు పంచాయతీ, ఆకులవారిపల్లిలో ద్విచక్ర వాహనం చోరీకి గురికావడంతో వారి ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించామన్నారు. ఈ క్రమంలో చరవాణి సహాయంతో మదనపల్లి చంద్ర కాలనీకి చెందిన ఉదయ్‌కుమార్‌ను బడికాయలపల్లి క్రాస్‌లో అరెస్టు చేసి విచారించగా నిందితుడు దగ్గర నుండి రూ.3.50 లక్షల విలువ చేసే ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇతనిపై గతంలో మదనపల్లి, పీలేరు, వాయల్పాడు, బి.కొత్తకోట తదితర ప్రాంతాలలో చోరీ కేసుల్లో కేసులు ఉన్నాయని తెలిపారు. రెండు సంవత్సరాలుగా బెంగళూరులో నివాసముంటూ ద్విచక్ర వాహనాలు చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఇతనిపై కేసు నమోదు చేసి రిమాండ్ పంపినట్లు తెలిపారు. ఈ దాడిలో హెడ్ కానిస్టేబుల్స్ రవీందర్ నాయక్, రెడ్డెప్ప నాయక్, కానిస్టేబుల్స్ లక్ష్మీనారాయణ, నరసింహులు, కావ్య, వెంకటరమణ పాల్గొన్నట్లు తెలిపారు.



నిందితుడిని అరెస్టు చూపుతున్న పోలీసులు